బహుమతి కథ



# అమ్మ కడియాలు

## —డాక్టర్ సూర్యదేవర అచ్చయ్య

రాజశేఖరం బస్సుదిగే సరికి రాత్రి పదయింది. బాగా వర్షంపడిన గుర్తుగా ఎక్కడబడితే అక్కడ నీటి మడుగులు కనబడుతున్నాయి.

బస్సు స్టాండు ఆవరణదాటి రోడ్డు మీదకి వచ్చాడు.

దుకాణాలన్నీ అప్పటికే మూసి వేశారు. ఎదురుగా వున్న ఓ చిన్న హోటలు మూసివేసే ప్రయత్నంలో సర్దుకుంటున్నారు. రాజశేఖరం ఆ హోటల్లోకి వెళ్ళి విచారించాడు ఏదైనా వాహనం దొరుకుతుందే మోనని.

"ఈ వేళప్పుడు ధైర్యంచేసి ఎవరూ బయలుదేరరు బాబూ! అందులోనూ ఈ రోజు ఇక్కడ పెద్ద వర్షం పడింది. రోడ్లు దొక్కుపోయి గుంటలుపడి వుంటాయి. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై వుంటాయి. ఎంత డబ్బిచ్చినా బయలుదేరటానికి ఎవరూ ముందుకు రారు" అన్నాడు హోటలు యజమాని బీడీ దమ్ము లాగుతూ.

ఏమి చెయ్యటానికీ తోచక బెంచీ మీద కూర్చున్నాడు రాజశేఖరం.

"ఏవూరు పోవాలిబాబూ?" హోటలు జయమాని అడిగాడు.

చెప్పాడు రాజశేఖరం.

"మరైతే మీ ఊరు ఇక్కడకు పది కిలోమీటర్లు పైనే వుంటుంది. ఇప్పడిక మీరు ప్రయాణం చేసే ఆలోచన మానుకోవడం మంచిది. కావాలంటే ఈ రాత్రికి మా హోటల్లో పడుకుని పొద్దున్నే లేచి వెళ్ళండి" అన్నాడు హోటలు యజమాని.

"లేదండీ! అర్జంటుగా వెళ్ళాలి. మా అమ్మకు సీరియస్‌గా వుందని టెలిగ్రాం వస్తే బయలుదేరి వచ్చాను. ఇప్పడెలా వుందో ఏమో!" మనసులోని ఆందోళన ముఖంలో వ్యక్తం అవుతుండగా అన్నాడు రాజశేఖరం.

హోటలు యజమాని రాజశేఖరం ముఖంలోకి చూస్తూ "ఈ రోజు పొద్దు మాపువేళ మీ ఊరి ఆడ కూతురు ఎవరో హాస్పట ల్లో చనిపోతే ఎడ్లబండి మీద తీసుకు వెళ్ళారు" అన్నాడు.

పిడుగు పడ్డట్లయింది రాజశేఖరానికి. ఒళ్ళంతా చమట పట్టింది. 'చనిపోయింది అమ్మ కాదుగదా!' అన్న ఆలోచన కలిగి క్షణం సేపు చైతన్యం కోల్పోయాడు. అంతలోనే తేరుకున్నాడు గాని అక్కడ నిలవలేకపోయాడు. బ్రీఫ్‌కేస్ తీసుకొని రోడ్డు మీదకి వచ్చాడు. పరుగులాంటి నడకతో ముందుకు సాగిపోతున్న అతనికేసి చూస్తూ వుండిపోయాడు హోటల్ యజమాని.

ఊరుదాటి వచ్చాడు రాజశేఖరం. మనసంతా అమ్మను గురించిన ఆలోచనలతో నిండిపోయింది.

ఫెళ ఫెళ మన్న ఉరుము శబ్దంతో పాటు తళుక్కున మెరుపు మెరిసింది. పరధ్యానంగా వున్న రాజశేఖరం ఉలికిపడ్డాడు.

ఆకాశాన్నంతా కారుమేఘాలు క్రమ్ముకున్నాయి. నల్లని చీకట్లు భూ ప్రదేశాన్ని కబళించి వేశాయి. ఈదురు గాలులు రొదపెడుతున్నాయి. రోడ్డు ప్రక్కన నీటి మడుగులోని కప్పలు రకరకాల శబ్దాలు చేస్తున్నాయి. ఆ భయంకర వాతావ రణంలో ఒంటరి ప్రయాణం చేస్తున్నాడు రాజ శేఖరం. తొందరగా ఊరుచేరాలన్న ఆరాటం ముందుకు తరుముతోంది. హోటలు యజమాని అన్న మాటలు ఎదలో గుబులు పుట్టిస్తున్నాయి.

నిజంగానే అమ్మకు ఏమయినా అయితే నడి సముద్రంలో చిక్కుకున్న నావలా అయిపోతుంది తమ కుటుంబ పరిస్థితి. నాయనా అమాయ కుడు! తన తరువాత నలుగురు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద చెల్లెలికి ఈ మధ్యనే వివాహం అయింది.

ప్రకృతి వికటాట్ట హాసం చేస్తూనే వుంది. ఆలోచనా పరంపరలు తరముతూనే వున్నాయి. నడక సాగుతూనే వుంది.

చదువుకోక పోయినా అమ్మకు ముందు చూపు ఎక్కువ. అమ్మ తనకు పలకా బలపం కొనిచ్చి బడికి పంపింది. అది కొందరికి ఆశ్చర్యంగానూ, కొందరికి హేళనగానూ వుండేది. తమలాంటి బీద కుటుంబాల వాళ్ళు పొలం పనులకు పోకుండా చదువుకోడానికి బడికి వెళితే ఆ రోజుల్లో అలానే వుండేది. ఇవన్నీ అమ్మ లెక్క చెయ్యలేదు.

తనది నాజూకుగా, ఆకర్షణీయంగా వుండే ఆకారం అంటారు. అమ్మ మనసులో ఏ దేవుడు ప్రవేశించాడో! తనను గురించి ఎటువంటి కలలు కన్నదో!

ఈదురుగాలి వొణుకు పుట్టిస్తోంది. చలి కుదు వుకు పళ్ళు కటకట అంటున్నాయి. మిరుమిట్లు గొలిపే మెరుపుల కాంతికి కళ్ళు బైర్లు గ్రమ్మి నట్లయి కొంతసేపు చూడటం కష్టమౌతోంది. వాన తాకిడికి మట్టి కొట్టుకు పోయి అక్కడక్కడ

**"ఒకప్పుడు అమ్మ పాదాలను మంద పాటి కడియాలు ఆశ్రయించి వుండేవి. ఇప్పుడు బోసిపోతున్న అమ్మ పాదాలు కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాయి."**

రాళ్ళు కొనదేలి వుండటాన ఎదురుదెబ్బలు తగిలి ఎగిరిపడుతున్నాడు. ఇవన్నీ పట్టించుకునే స్థితిలో లేదు రాజశేఖరం.

తన కొద్దిపాటి జీవితం ఇప్పటికే ఎన్నో మలుపులు తిరిగింది. దేవుడులాంటి నాగభూషణరావు గారి ఆశ్రయం దొరికాక తన నావకు చుక్కాని దొరికినట్లయింది. వారి ఆశ్రయంలోనే బి.ఎ. వరకు చదివి రైల్వే ఉద్యోగంలో చేరి రెండు నెలలయినా కాలేదు.

అమ్మ తన కోసం చెయ్యగలిగిన త్యాగాలన్నీ చేసింది. ఒకసారి తనకు డబ్బు అవసరం పడింది. ఎక్కడా చేబదులు కూడ దొరకలేదు. అమ్మ కాళ్ళకు బరువైన వెండి కడియాలు వుండేవి. అమ్మ కాపురానికి వచ్చేటప్పుడు అమ్మమ్మ వాటిని చేయించిందట. అప్పటి కప్పుడు రంగయ్యతో వాటిని అమ్మించి వచ్చిన డబ్బును తనకు ఇచ్చి పంపించింది. ఆ సంఘటన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా తన మనసు వ్యాకుల పడుతూ వుంటుంది.

అమ్మ చావకూడదు. అమ్మ బ్రతికే వుండాలి. అమ్మ పెంచిన మొక్క తను. తనొక మహా వృక్షమై విస్తరించి తన తోబుట్టువులకు ఆశ్రయం కావాలి. అది చూచి అమ్మ ఆనందించాలి. భగవాన్! అమ్మ తనకోసం, తన అభివృద్ధిని చూచి ఆనందించడం కోసం జీవించి వుండాలి అనుకుంటూ ముందుకు పోతున్నాడు రాజశేఖరం.

మెరుపుల కాంతిలో ఇళ్ళు కనబడితే ఊరి దాపులకు చేరుకుంటున్నట్లు తెలుసుకున్నాడు.

హోరుగాలి ఆర్తనాదాలను మోసుకొస్తోంది. రాజశేఖరం గుండె ఝల్లుమంది. కాళ్ళు తడబడ్డాయి. మైకం వచ్చినట్లయింది. ఎట్లాగో తమాయించుకొని తనలోని శక్తినంతా కూడదీసుకొని ఊళ్ళోకి చేరాడు.

ఏడుపులు తమ ఇంటి నుండేనని తెలుసుకున్నాక అర్థమయింది. అమ్మ ఈ ప్రపంచం విడిచి వెళ్ళిపోయింది. పుణ్యాత్ములు ఎక్కువ కాలం జీవించరు అంటారు. అమ్మ విషయంలో అదే జరిగింది. తను వాకిట్లోకి వెళుతూనే అందరూ తనను చూచి గొల్లుమన్నారు. పందిరి కింద అమ్మ



## మహాస్ఫూర్తి



**గం**జాయి అలవాటుగల ఒక సాధువు శ్రీరామకృష్ణ పరమహంసను ఇలా ప్రశ్నించాడు "ఈశ్వరుడు అన్నిటిలోనూ సమానముగా వుండగా ఒకడు యోగ్యుడుగాను, మరొకడు అయోగ్యుడుగాను వుండుటకు కారణమేమిటి?"

దానికి పరమహంస "ఈశ్వరుడు అందరిలో ఒకే విధంగా, అంటే సమానంగా వున్నాడు కానీ ఈశ్వరుని యందు అందరూ సమానముగా వుండడం లేదు. అందువల్లనే ఒకడు భక్తుడుగాను మరొకడు బద్ధుడుగాను వుండుట జరుగుతున్నది" అని చెప్పారు.

— ఎం.ఎస్.ఎం

చైతన్యం లేకుండా పడివుంది.

"పచ్చ కామెర్ల జబ్బు ముదిరిపోయి సడన్‌గా ప్రమాదం ముంచుకొచ్చింది" అని చెప్పాడు మామయ్య.

అమ్మ పక్కనే కూర్చుండి పోయాడు రాజశేఖరం తెల్లవారేవరకు. తెల్లవారాక తరువాత కార్యక్రమానికి ఏర్పాట్లు మొదలయ్యాయి.

త్యాగమూర్తి అమ్మ. తన జీవిత కాలంలో ఏ సుఖాన్నీ ఆశించలేదు. ఐశ్వర్యాలకు అర్రులు చాచలేదు. ఉన్నంతలో గుట్టుగా ఇంటిని దిద్దుకొచ్చింది.

కొద్దిసేపట్లో అగ్నికి ఆహుతి కాబోతున్న అమ్మను తనివితీరా చూసుకున్నాడు రాజశేఖరం. అమ్మ ప్రశాంతంగా నిద్ర పోతున్నట్లే అనిపిస్తోంది. అతని చూపులు అమ్మ పాదాలను పరికించాయి. ఒకప్పుడు ఆమె పాదాలను మందపాటి వెండి కడియాలు ఆశ్రయించి వుండేవి. అవి ఉన్నప్పుడు అమ్మ పాదాలు నిండుగా వుండేవి. ఇప్పుడు బోసి పోతున్నాయి.

"పరమేశ్వరా! నా ఉన్నతి కోసం అణువణువు తపించిన అమ్మను ఇంత తొందరగా నీ సన్నిధికి పిలుచుకున్నావా ప్రభూ!" అని పరి పరివిధాల వాపోయాడు.

అతనిలో చెలరేగిన అంతర్మథనం క్రమక్రమంగా మనసులో వెలుగు రేఖలు ప్రసరింప జేసింది.

తన కోరిక తీరకుండానే అమ్మ వెళ్ళిపోయింది. బోసిపోతున్న అమ్మ పాదాలు తన కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నట్టు అనిపించసాగింది.

తను ఇంటికి పెద్ద వాడు. తను పైకి వస్తే తలిమ్మా వారికి ఆసరా ఔతాడని అమ్మ ఆశపడింది. ఇంటికి పెద్దవాడుగా తన బాధ్యత తను నెరవేరిస్తే అమ్మ ఆత్మ శాంతిపడుతుంది.

ఈ ఆలోచన స్ఫురించినాక రాజశేఖరం మనను తేలికపడసాగింది.

అమ్మ స్మృతిలోనూ, తనలోనూ ఏర్పడిన వెలితి ఆ విధంగా క్రమంగా తీరుతున్నట్టనిపిస్తోంది. అమ్మ బోసిపోయిన పాదాలు తన హృదయం మీద ముద్రించినట్లు అనుభూతి కలిగింది. ★


మీ భవిశ్యత్తును తెలుసుకోండి

భవిశ్య ఫోన్

వారఫలాలు

☎ 001 609 936 30 + ☐☐

పైన ఇచ్చిన మొత్తం పదకొండు అంకెలకు మీ సూర్యరాశికి ఎదురుగా ఇచ్చిన రెండు అంకెలను కలిపి వరుసగా డయల్ చేయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 51 | 52 | 53 | 54 | 55 | 56 |
| మేషం | వృషభం | మిథునం | కర్కాటకం | సింహం | కన్య |
| 57 | 58 | 59 | 60 | 61 | 62 |
| తుల | వృశ్చికం | ధనుస్సు | మకరం | కుంభం | మీనం |

టారట్
జాతక ఫలాలు

ఇది జాతక ఫలాలను చెప్పే ప్రాచీన పద్ధతి. మీరు అడిగే నిర్దిష్టమైన ప్రశ్నలకు సమాధానాలు యిస్తుంది.

ఫోన్ చేయండి:
001 609 936 3067

రాశి కలయిక

మీరు, మీ జీవిత భాగస్వామి ఎంత అన్యోన్యంగా ఉంటారు?

ఫోన్ చేయండి:
001 609 936 3063

ఇది ఇంటర్నేషనల్ కాల్. నిర్దిష్టమైన ధరలు వర్తిస్తాయి వరల్డ్ ఫోన్ యు.ఎస్.ఎ.